# ఇది మామూలే!



పి.వి.ఆర్. శివకుమార్

"ప్రియమైన సరళా,

ఒక శుభవార్త. అనుకోకుండా ఆఫీసు పనిమీద హైద్రాబాద్ వెళ్లాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయానికి అక్కడ వుండాలి. కాబట్టి, ఎల్లుండి ఉదయం 'గోల్కొండ'లో బయల్దేరుతున్నాను.

దారిలో ఖమ్మంలో దిగదల్చుకున్నాను. షుమారు తొమ్మిది గంటలకి మీ యింటికి చేరుకోగలననుకుంటాను.

ఎన్నాళ్ళ... ఊహుఁ..., ఎన్ని నెలల కోరిక! ఇప్పటికి తీరబోతోంది. కదూ? నువ్వూ నా కోసం ఎదురుచూస్తూ వుంటావని తలుస్తాను.

సందు దొరికిందే చాలన్నట్టుగా, మా అమ్మ హైద్రాబాదులో రెండు పెళ్ళి చూపులక్కూడా ఆటెండవ్వమంటూ ఆర్డర్ జారీచేసింది.

ఆ రెండిటి మాటా ఎలా వున్నా, యీసారి తిరిగి వచ్చేసరికి ఇహ మా అమ్మ నన్ను పెళ్ళి విషయమై సాధించ

నక్కర్లేని స్థితికి చేరిపోవాలని నా ఆశ- పోతానే నమ్మకం !

ఎల్లుండి సాయంత్రం తిరిగి హైద్రాబాద్‌కి, వెళ్ళిపోవాలి, ఖమ్మం నించి.

ఆరేడు గంటల వ్యవధి... ఎన్ని కబుర్లయినా చెప్పుకోవచ్చు కదూ మనం ?

మిగతా సమక్షంలో

నీ

మిత్రుడు

హరి.

నిద్రపట్టటంలేదు సరళకి. కళ్ళు మూసినా, తెరిచినా ఆ ఉత్తరమే కళ్ళ ముందు మెదల్తోంది. హరి వస్తున్నాడనే తలపే మనసుని ఉద్వేగపూరితం చేసేస్తోంది.

పక్కమీంచి లేచి లైటువేసింది. వెళ్ళి, పెట్టె తెరిచి ఉత్తరాల కట్ట అందుకుంది.

అవన్నీ హరి వ్రాసిన ఉత్తరాలు. అన్నీ ఆమెకు కంఠతా వచ్చు.

అయినా మళ్ళీ చదవాలనిపించింది.

కట్ట విప్పింది. మొదటి ఉత్తరం— ఏడెనిమిది నెలల క్రితం అతను రాసిన ఉత్తరం– తెరిచింది.

"నా అభిమాన రచయిత్రీ !

నమస్తే.

గత సంవత్సరన్నరగా 'సమత' మాసపత్రికలో ధారావాహికంగా వెలువడ్డ మీ నవల 'నవతరం' చదివిన తర్వాత మీకు ఉత్తరం రాయకుండా వుండలేకపోతున్నాను.

ఇదివరలో కూడా, 'విముక్తి', 'చేవ చచ్చిన యువత', 'కర్తవ్యం' లాటి మీ కథలు, 'మారుతున్న కాలం', 'ఇలా సాగాల్సిందేనా ?', 'యువత-బాధ్యత' వంటి మీ వ్యాసాలూ చదివి చాలా ఇంప్రెస్ అయ్యాను. అప్పట్నుంచీ మీ చిరునామాకోసం ప్రయత్నించి కూడా నిరాశే మిగుల్చుకున్నాను.

కానీ, యీ నవల చదివేక యిహ వుండబట్టలేక, స్వయంగా 'సమత' సంపాదకుల్ని కలుసుకొని మీ చిరునామా సంపాదించాను.

ఈ నాటికి నా కోరిక నెరవేరటం ఓ రకంగా నా అదృష్టమేమో !

మీ 'నవతరం' నవల నన్ను అమితంగా ఆకర్షించింది. అందులోని పాత్రలు నేను అభిమానించే నవతరపు యువతీ యువకుల వ్యక్తిత్వాలకి ప్రతీకలు కావటమే అందుకు కారణం కావచ్చు.

ఈనాటి వ్యవస్థమీద విపరీతమైన వైముఖ్యం కనబడుతుంటుంది మీ రచనల్లో. అలాంటి వైముఖ్యమే నాకూ వుండటాన్నే మీ అభిప్రాయాలు నాకు నచ్చుతున్నాయనుకుంటాను.

మీ రచనల్లో కన్పించే ఆదర్శాలూ, వంచనని ఎదిరించి మంచిని పెంచటానికై యువతకి మీరు సూచించే

ఆచరణీయమైన పరిష్కార మార్గాలూ..
నాకు చాలా యిష్టం.

మీ కభ్యంతరం లేకపోతే మీతో పరిచయం పెంచుకోవాలని కోరే—

హరి."

అదే వారి పరిచయానికి నాంది.

అటువంటి లేఖ అందుకోవటం అదే మొదలు ఆమెకు. వెంటనే జవాబు వ్రాసింది.

అప్పట్నుంచీ పరిచయం పెరిగింది. స్నేహంగా మారింది.

హరి పాతికేళ్ల యువకుడు. రచయిత కాకపోయినా, ఆదర్శాలు చాలా కనపర్చేవాడు ఉత్తరాల నిండా.

కాస్తో, కూస్తో మంచి ఉద్యోగం వుండి, కడుపునిండుతూ, ఏ బాదరబందీ లేనివాళ్లలో ఆదర్శవంతుల మనుకునే యువకులకి ఆదర్శం అంటే ముఖ్యంగా ఒక్కటే- కోరుకున్న యువతిని కుల, మతాల ప్రమేయం లేకుండా, కట్నం తీసుకోకుండా పెళ్లిచేసుకోవడం! దాంతో ఎన్నో సాధించేసిన తృప్తి కలుగుతుందని ఆశపడుతుంటారు.

అలాటి ఆశయమే హరిదీనూ!

ప్రతి ఉత్తరంలో అలాటి విషయాలే ప్రస్తావించేవాడు. కులమతాలు పోవాలనీ, కట్నదురాచారం నశించాలనీ, యువతీ యువకులకి వివాహపూర్వ పరిచయాలు, ప్రేమానురాగాలు వుండాలనీ, పరస్పరం అర్థంచేసుకుని, ఆ దారాగా కాకుండా రిజిష్టర్ మ్యారేజెస్ చేసుకోవాలనీ...ఇలా వ్రాస్తూ వుండేవాడు.

"ఉద్యోగం రావటం కాదుగానీ పెద్ద గండమై పోయిందనకో? పెళ్ళి... పెళ్ళి అని ఒకటే గొడవ మా అమ్మ.

పెళ్లిచూపుల్లో ఏం తెల్సుకుంటాం ఒకళ్ల నొకళ్లు? బాహ్య సౌందర్యంతో తృప్తిపడితే చాలా? ఏమో, నాకు బొత్తిగా యిష్టంలేదు. అందుకే మొండి కేస్తున్నాను..."

"కన్నొంకరా, కాలొంకరా కాకుండా చూసుకుంటే చాలదమ్రా? వంశం, సాంప్రదాయం, కట్నం- అన్నీ మన స్థాయికి తగ్గట్టే వున్నాయిగా!..."

అంది అమ్మ.

"కన్నొంకరో, కాలు వంకరో అయినా ఫర్లేదమ్మా, మనసు వంకర కాకపోతే చాలు— అన్నాన్నేను.

నువ్వేమంటావ్ సరళా — అంతే కదూ?"

"ఈ వారం పడిన నీ కథ చాలా బావుంది. మీ హీరోయిన్ నిర్ణయం నాకు బాగా నచ్చింది. అయినా కథ కాబట్టి అలా వ్రాయగలిగావు గానీ, అదే నీ జీవితమైతే మీ హీరోయిన్లా ప్రవర్తించ గలవా నువ్వు?"

ఇలా వుండేవి ఆ నాటి ఉత్తరాల్లోని విషయాలు!

జీవితంలో అలాంటి సంఘటన

ఎదురుపడినా, హీరో కూడా అలాంటి వాడు కావదూ ?' అనుకుంది సరళ.

ఆమె కూడా ప్రాయంలో వున్న యువతే. కనుకనే అతని ఉత్తరాలు ఆమెని ఉత్తేజపరుస్తుండేవి.

అంతకు ముందుదాకా 'తన జీవితంలో అసలు వసంతమంటూ విరుస్తుందా ? వెన్నెలంటూ కురుస్తుందా ? అందరమ్మాయిల లాగే తనూ ఓ యువకుణ్ణి చేపట్టి, బ్రతుకు నందనం చేసుకో గలుగుతుందా ? తన ఆశయాలకీ, అభిరుచులకీ అనుగుణమైన వ్యక్తి జీవితంలో తారసపడతాడా ?' అన్న శంకలతో కృంగిపోతుండే ఆమెకు హరి ఉత్తరాలు కొత్త ఆశల్ని కలిగించసాగేయి.

అప్పుడప్పుడూ నిరాశ మనసుని మళ్ళీ మబ్బుల్లాగే కమ్మినా, అతడి ఉత్తరాల్లో పరోక్షంగా ప్రస్ఫుటమయ్యే 'కోరిక' ఆ మబ్బుల్ని దూదిపింజల్లా ఎగరగొట్టేసేది !

'తన మనసు అతనికిప్పుడు పూర్తిగా తెలుసు. తన ఫోటో అతను పత్రికల్లో చూశాడు. తన నతడు యిష్టపడుతున్నట్టే పరోక్షంగా ఎన్నో ఉత్తరాల్లో తెలియజేశాడు!

నిన్న మాత్రం ?

'ఈసారి తిరిగివచ్చేసరికి ఇహ మా అమ్మ నన్ను పెళ్లి విషయమై సాధించనక్కర్లేని స్థితికి చేరిపోవాలని నా ఆశ...'

అంటే ?

తనమీద ఆశ వున్నట్టు కాదూ ?

"కానీ... యీ ఆశా, అతని ఆశయాలూ తనని ప్రత్యక్షంగా చూసేక కూడా నిలుస్తాయా ?"

"నిలుస్తాయి. తప్పకుండా నిలుస్తాయి. అందర్లాంటివాడు కాడు హరి. ఆదర్శాలున్నవాళ్లు కొన్ని చిన్న చిన్న త్యాగాలకైనా సిద్ధంగానే వుంటారు."

ఆ భావనలోనే వూరటచెందింది సరళ.

ఉత్తరాలన్నీ సర్దేసి, లైటు ఆర్పేసి పక్క మీదికి చేరింది.

మధురోహల్లోనే నిద్రపట్టేసిందామెకి.

* * *

మర్నాటి ఉషోదయం సరళకి నవోదయంగా కన్పించింది. తొమ్మిదింటిదాకా ఎదురుచూడటంతోనే గడిచిపోయింది. తండ్రికి, తల్లికి చెప్పింది 'అతడు' యివేళ వస్తున్నాడని.

పాఠకుల ఉత్తరాలూ, అరుదుగా ఎవరైనా రావడం వాళ్లకి కొత్తకాదు అంతకుమించి అతడిగురించి అధికంగా ఆమె చెప్పనూలేదు. అందుకే వాళ్లకేమీ వింతగా అనిపించలేదు హరి రాక.

ఇంటిముందు రిక్షా ఆగటం కిటికీలోంచే చూసిన సరళ, ఇంటినంబర్ సరిచూసుకుంటున్న హరిని తేలిగ్గానే

మీ మీద నాకు ప్రేమ తెగ పోవడ మేమిటండీ?
— మీ పిచ్చి గానీ!!!



పోల్చుకుంది. గబుక్కున నడవాలోకి వచ్చింది.

"రండి, రండి. మీరు 'హరి' గారు కదూ?" అంది, అతడు మెట్లెక్కుతుంటే.

"అవును. మీరే కదూ సరళ?"

"ఔనండీ. నమస్తే!"

రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది సరళ.

ఎదురుచూడని 'వింత' జరిగినట్టుగా ఉలిక్కిపడి, ప్రతి నమస్కారం చేశాడు హరి, "నమస్తే."

ఆమె వెనకే లోపలికి నడిచాడు.

అతడిలోని తత్తరపాటు గమనించిన సరళ ముఖం క్షణంపాటు మ్లానమయింది. అంతలోనే తేరుకుని, కుర్చీ చూపింది

తండ్రికీ, తమ్ముడికీ అతణ్ణి పరిచయం చేసింది.

"ఇల్లు తేలిగ్గా దొరికిందాండీ?" అడిగింది.

"ఆ... ఫర్వాలేదు. గుర్తుల్నిబట్టి రిక్షావాడే తీసుకొచ్చేడు." వెలితిగా నవ్వాడతను.

ఇంతలో చెల్లెలు కాఫీ, టిఫినూ తీసుకువచ్చింది.

"ఇప్పుడెందుకు సరళా... ఎందుకండీ యివన్నీ!" మొహమాటంగా అన్నాడు హరి.

"ఎదుటపడగానే ఏకవచనం వదిలివేయనవసరం లేదండీ!... ఫర్లేదు, లైట్ టిఫినేగా — తీసుకోండి." అంది సరళ.

తమ్ముడు కాలేజీకీ, నాన్నగారు

ఆఫీసుకి అంటూ వెళ్లిపోయేరు-వో పావు గంట గడిచేక.

ఏవో ప్రశ్నలు అడుగుతోంది సరళ. ఎక్కడో ఆలోచిస్తూ జవాబు లిస్తున్నాడు హరి.

"ఎన్నో మాట్లాడాలనుకున్నాడు. ఎంతో ఆశగా వచ్చాడు. ఏమీ మాట్లాడలేకపోతున్నాడేం? తన మన సింత దుర్బలమా?"

మనసులోనే మథనపడిపోతున్నాడు.

రాను రాను వాతావరణం- వాళ్ళిద్దరూ ఆశించిన విధంగా అహ్లాదకరంగా కాకపోగా- అమిత కృతకంగా తయారయింది.

ఒకగంట గడిచిపోయింది.

"ఇక నేను వెళ్తాను మరి. ఒక ఫ్రెండ్‌ని కల్సుకోవాలి," అన్నాడు హరి.

"అదేం? ఇక్కడే వుంటారనుకున్నాను సాయంత్రందాకా," బాధగా అంది సరళ. "కనీసం భోజనమైనా చేసి వెళ్లరూ?"

"సారీ! వాళ్లింటికి భోజనానికే వస్తానని రాశాను. వీలయితే, తిరిగి వెళ్ళే రోజు దిగుతాన్లెండి మీ యింట భోజనానికి." ఇబ్బందిగా నవ్వుతూ అన్నాడు హరి.

'ఎలాగూ దిగడు,' అనుకుంది సరళ.

"మీ యిష్టం మరి," అంది పొడిగా

"సారీ. వెళ్లి వస్తాను."

"ఎన్నో మాట్లాడాలన్నారు. అప్పుడే వెళ్లిపోతున్నారు." ఉపుకోలేక అనేసింది చివరగా.

"అవును. ఎన్నో మాట్లాడాలనుకున్నాను టైమ్ లేకపోతోంది." నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు హరి.

'టైమ్ లేకపోతోందా? మనసు రాకపోతోందా?' మనసులోనే అనుకుంటూ దిగవిడిచిం దతడిని.

"ఉత్తరం రాస్తారుగా-తిరిగి మీ వూరెళ్లగానే?"

"ఓయస్" అన్నాడు హరి

అతడు రోడ్డు మలుపు తిరుగుతుండే, ఆమెకి గుండెలు పట్టేసినట్లయింది.

'అయిపోయింది, రావటమూ, పోవటమూ కూడా!' అనుకుంటూ లోపలకు నడిచింది.

* * *

రెండు వారాలు గడిచిపోయాయి.

హరి దగ్గర్నుంచి ఉత్తరం రాలేదు సరళకి. వస్తుందన్న ఆశ క్రమంగా సన్నగిలిపోయింది ఆమెలో.

'ఇక రాదు. ఇదే చిట్టచివరి లేఖ' అనుకుంది అతడు అంతకు ముందు వ్రాసిన ఉత్తరం పదోమారు చదువుకుంటూ.

'ఈసారి తిరిగి వచ్చేసరికి ఇహ మా అమ్మ నన్ను పెళ్ళి విషయమై

సాధించ నక్కర్లేని స్థితికి చేరిపోవాలని నా ఆశ...'

ఎన్నిసార్లు చదివినా, అక్కడే ఆగి పోతున్నాయి కళ్లు.

"లాభం లేదు హరీ! అయాం వెరీ సారీ! నిన్నా స్థితికి చేర్చలేకపోయాను. మనసులు కలిసినా, మనల్ని కలపలేని అంశాలు మరెన్నో! నువ్ మాత్రం మామూలు మనిషివి కావూ? ఆశయాల్తో పాటు ఆశలూ వుండవూ?" అనుకుంది.

శిశిరం అంతమవుతుండగా విన వచ్చిన కోయిల పాటలా ఆమె ఆశలు అంతమవుతుండగా వినపడింది పోస్ట్ మాన్ పిలుపు.

పరుగుతో వెళ్ళి అందుకుంది ఉత్తరాలు.

అందులో... అందులో హరి వ్రాసిన కవరూ వుంది

"కాదు... కాదు... అది కాదు చిట్ట చివరి లేఖ. మళ్ళీ రాశాడు హరి..." ఉద్వేగంగా అనుకుంటూ పర్రుమని చించింది సరళ– ఆ కవర్ని.

కాయితం బయటికి లాగటంతోటే మళ్ళీ తత్తరపాటు.

'ఏం రాశాడు? ఏం రాసి వుంటాడు?'

కళ్లని అక్షరాలమీద పరుగు లెత్తించింది.

"డియర్ సిస్టర్,

.........

అదిరిపడి చివరి సంతకం చూసింది, 'ఇది వ్రాసింది హరి కాదా?' అనుకుంటూ.

.............

బ్రదర్లీ యువర్స్
హరి.

అని వుంది చివర్లో.

"డామిట్! ఎంత పిరికివాడివి హరీ! ధైర్యం లేకపోతే పోయింది. వరసలు మారుస్తూ ఆత్మవంచన గూడా ఎందుకు చేసుకుంటావ్? నేను —నీకు— చెల్లెలినా? మొదటినుంచీ అలాగే భావించి రాశావా ఆ ఉత్తరాలన్నీ?

వొద్దులే హరీ, ఇంతటి దౌర్భాగ్యురాలైన చెల్లెలు గూడా వొద్దు నీకు..."

ధారాపాతంగా కారుతున్న కన్నీళ్లలో మిగతా ఉత్తరం చదివే శక్తి గూడా లేక, లోపలికి వెళ్ళి మంచంమీద కూలబడిపోయి, వున్న ఒక్క చేతిలోనే ముఖాన్ని దాచుకుంది – మణికట్టుమీద చిన్నప్పుడే లేచిన కురుపుకి జరిగిన ఆపరేషన్లో ఎడమ అరచెయ్యి కోల్పోయి– రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకోగలపాటి అదృష్టానిక్కూడా నోచుకోని సరళ.

